# గొల్లహంపన్న

[ కథ ]

•

= 'జమదగ్ని' =

రైలు వచ్చే వేళ అయిందని అప్పుడే హంపన్న ఇవతలి గేటు వేశాడు. రెండో గేటు వెయ్యబోతుండగా 'ఉండన్నా ఉండు' అంటూ ఆడగొంతు వినిపించింది.

ఎవరా అని హంపన్న తలెత్తిచూచాడు. ఎవరో ఇద్దఱు స్త్రీలు గేటువైపుకు, దేనికో భయపడిపోయినట్లు, పరుగెత్తుకువస్తున్నారు. హంపన్న నిశ్చై నిలబడిపోయాడు. అయిదునిమిషాలు కాలేదు. ఆ ఇద్దఱూ గేటుదగ్గఱికు రానేవచ్చారు. ఎంత భయపడిపోయారో ఏమో, నోటివెంబడి మాటలేక ఒకమాటు హంపన్న వంకకూ, మఱొకమాటు రోడ్డువైపుకూ చూస్తూ గజగజలాడిపోతున్నారు. హంపన్న ఇటు వీళ్లవంక చూచాడు. గుండె ద్రవించిపోయింది. అటు రోడ్డువంక చూచాడు. వచ్చిన కోపంతో, పట్టుదలతో గుండె రాయి అయిపోయింది. దభీమని గేటు నొక్కి తాళం వేశాడు. ఆ స్త్రీలకిద్దఱికూ తన షెడ్డు చూపించాడు. వాళ్లను లోపలికి వెళ్లి తలుపు వేసుకోమన్నాడు. తాను బయట తాళం వేశాడు. ఏమీ ఎఱగనట్లు జెండాలు పుచ్చుకుని షెడ్డు కిరవైగజాల దూరంలో రైలుకోసం ఎదురుచూస్తూ నిల్చున్నాడు.

పది నిమిషాలు కాలేదు. నేల అదిరేటట్లు నడుస్తూ, ఒళ్లు తెలియని కేకలు వేస్తూ అరడజనుమంది తెల్లసోల్జర్లు గేటుదగ్గఱికు వచ్చారు.

అప్పుడే సూర్యాస్తమయం అవుతోంది. పోతూ పోతూ సూర్యుడు చూపుకందినంతవఱకూ జగత్తంతా రక్తవర్ణమయం చేస్తున్నాడు. హంపన్న అటువైపే చూస్తున్నాడు.

గేటు తాళంవేసిఉండడం చూసి ఒకరి తరువాత ఒకరుగా గేటు దూకేశారు సోల్జర్లు. వాళ్లల్లో ముందుదూకిన సోల్జరొకడు తెల్లగా, పొట్టిగా, ఎఱ్ఱని కళ్లతో, ముడిచిన బొమలతో మహాక్రూరంగా ఉన్నాడు. ఎప్పుడన్నా గట్టి చెంపదెబ్బ తిన్నాడో ఏమో ముఖం కొంచెం వంకరతిరిగింది. అతగాడు అమాంతం ఒక్క అంగలో షెడ్డుదగ్గఱికు వెళ్లాడు. తాళం వేసిఉంది. పళ్లు పటపట కొఱుకుతూ హంపన్నవైపు చూచాడు. హంపన్న అస్తమయసూర్యునివంకే చూస్తున్నాడు. పక్షుల అరుపులు వింటున్నాడు. ఇతని నిర్లక్ష్యాన్ని సహించలేకపోయాడు సోల్జరు. బూటుకాలు నేలకేసి గట్టిగా కొట్టి ఒక్కదూకున వెళ్లి పదిగజాల్లో పడిఉన్న పెద్ద రాయి చేత్తో పుచ్చుకున్నాడు. కాలు కదపకుండా కళ్లు అటూ ఇటూ తిప్పిచూస్తున్న హంపన్న హడిలిపోయాడు. గాలితాకిన లేతవెదురుమొక్కలా గజగజలాడిపోయాడు.

ఒక్కనిమిషం కాలేదు. షెడ్డుతాళం ఠప్పుమని పగిలిపోయింది. హంపన్న గుండె పగిలినంత పని అయింది. మఱునిమిషంలో ఆఱురెళ్లు పన్నెండు కాళ్లూ తలుపును తన్నడం మొదలుపెట్టాయి. హంపన్నకు తన తొమ్మెక్కి తొక్కుతున్నట్లనిపించింది. ఇంతవఱకూ చూచింది చాలు. ఇక ఆగలేకపోయాడు. చేతిలో జెండాలు రెండూ దూరంగా పారేశాడు.

పక్కనున్న చిక్కడుపాదు స్తంభం లావుపాటి వెదురు బొంగు ఒక్క ఊపున లాగేశాడు. తాను ఎదుర్కోబో తున్నది సాయుధులైన ఆరుగురు తెల్లసోల్జర్లను. తానేమో వంకమాత్రసాయుధుడైన ఏళ్లైఏళ్ల ముసలి తొక్క. ఈ తారతమ్యజ్ఞానం ఆ క్షణంలో అతనిలో పూర్తిగా నశించింది. వీరాంజనేయం ఆవేశించినట్లు వెళ్లిపడ్డాడు సోల్జర్లమీదికి. హంపన్న వచ్చిన దూకు డుకు నిశ్చేష్టులై, ఆరుగురు సోల్జర్లూ తమ నాయకుడు వచ్చి ఆగండన్నట్లు ఆగిపోయారు.

ఆ నిశ్శబ్దంలో తీవ్రాతితీవ్రమైన అబలల రోదన ధ్వని వినిపించింది. అది వినపడడం హంపన్న ఆవేశా గ్నికి ఆజ్యం పోసింది.

ఒకనిమిషం- కాదు అరనిమిషం వ్యవధిఉన్నా ముందున్న వక్రముఖంమీద వెదురుబొంగు పడిపో యేదే! కాని హంపన్న అడుగు అణుమాత్రం కదిలిందో లేదో - ముందున్న సోల్జరుచెయ్యి పక్కజేబులోంచి పైకి వచ్చింది.

అంత ఆవేశంతో వచ్చిన హంపన్నా 'రామా' అ టూ కూలబడిపోయాడు.

గుండు పేలడం, హంపన్న ఏడ్పుగొంతు వినిపిం చడం తడవుగా లోపల ఉన్న స్త్రీలిద్దఱూ తలుపులు తెరుచుకు బైటికివచ్చారు.

వెనకనుంచి సమీపిస్తున్న రైలుచప్పుడు విని ఆరుగురు సోల్జరూ ఆ ఆడవాళ్ల వంక అతికరుకుగా ఒక్కమాటు చూచి ఒక్క అంగన రైలుకట్ట దాటి జొన్నచేలల్లో బడి మాయమైపోయారు.

తమ మానం రక్షించడానికి తన ప్రాణానికి తెగించిన హంపన్నమీద పడి ఆ స్త్రీలు ఇద్దఱూ గొల్లున గోలపెట్టారు.

చిక్కడుపాదుమీద పడి వేలాడుతున్న ఎఱ్ఱ జెండా చూచి రైలు గేటుదగ్గఱ ఆగిపోయింది.

తొడలోనుండి నెత్తురు కారుతూ గిలగిల కొట్టు కుంటున్న హంపన్నను చూచి రైలు దిగి గార్డు ప్రథమ చికిత్స చేశాడు.

అంతకుముందు హంపన్న కేతోడూ లేదు. ఇప్పుడో? వేలకొలది రైల్లో జనమందఱూ అతని చుట్టూ మూగిఉన్నారు.

రైలుగార్డు హంపన్ననూ, ఆ స్త్రీలనూ రైల్లో ఎక్కించుకుని గుంటకల్ చేర్చాడు.

## ౨

హంపన్న గుత్తికాపురస్థుడు. అత డప్పటికి భార్యాబిడ్డల్ని కోల్పోయి ఏకాకి అయిపోయాడు. కొద్దో గొప్పో తనకు చేతనైనంతలో లోకోపకారం చేసి మంచివా డనిపించుకుంటున్నాడు. అనవసరంగా ఏ విషయంలోనూ జోక్యం కలిగించుకోకుండా కాల క్షేపం చేసేవాడు.

అట్లాంటి హంపన్నను మిలిటరీసోల్జర్లు కాల్చా రన్న వార్త వాయువేగమనోవేగాలతో ఇటు గుత్తి లోనూ, అటు గుంటకల్లులోనూ అరగంటలో అల్లుకు పోయింది.

ఆనాడు గుంటకల్లుస్టేషనులో ఎక్కడలేని జనమూ పోగయారు. ప్రతివారూ హంపన్నదుస్థితిని చూచి అయ్యోపాపం అని జాలిపడుతున్నారు. జరిగిన సంగతి తెలిసిన కొందఱు హంపన్నధైర్యాన్ని ప్రశం సిస్తున్నారు. మఱికొంద ఱంత మంచివాణ్ణి హింసిం చిన ఆ సోల్జర్ని నిందిస్తున్నారు. హంపన్నమాత్రం అతినీరసస్థితిలో ఉన్నాడు.

హంపన్న కేసు విచారించవలసిన బాధ్యత రైల్వే పోలీసువారిమీద పడింది. హంపన్న నడిగితే ఎవ్వరో సోల్జరు కాల్చాడని చెప్పాడు.

గుంటకల్లుస్టేషనుకు దగ్గఱలో ఇప్పుడున్న ట్రావెలర్స్‌బంగళా పూర్వం మిలిటరీభవనంగాఉండేది. దానికి సమీపంలో ఆరోజుల్లో బెంగుళూరునుంచి సికింద్రాబాదు వెళ్తున్న సైనికపటాలం ఒకటి విడిసి ఉంది. ఆపటాలం పటాలం ఆరాత్రే సికింద్రాబాదు వెళ్లిపోతుంది. అందుచేత రైల్వేపోలీసువారు మఱీ తొందఱపడవలసివచ్చింది.

హంపన్నను ప్లాటుఫారముమీదే ఒక కుర్చీలో కూర్చోబెట్టారు. ఆ సోల్జర్లనందఱినీ స్టేషనుకు రప్పిం

చారు. ఒకరితరువాత ఒకరుగా మెల్లగా హంపన్నకు ముఖం చూపిస్తూ అతని ముందుగా నడవమన్నారు. హంపన్న అంత నీరసస్థితిలోనూ వాళ్లవంక జాగ్రత్తగానే చూచాడు. మొత్తం సోల్జర్లు అయిదువందల మంది. అందఱూ ఒకేవిధమైన మిలిటరీ వేషాల్లో ఉన్నారు. హంపన్నకు తన్ను కొట్టిన సోల్జరుముఖం బాగా జ్ఞాపకంగానే ఉన్నది. వక్రముఖం, పొట్టి శరీరం, చేతిమీద పచ్చపొడిచిన సిలువగుర్తూ, ఎఱ్ఱని కళ్లూ అన్నీ గుర్తున్నాయి. కాని అప్పటి ఆ నీరసస్థితిలో ప్రాణనిర్వాణసమయం ఆసన్నమవడంచేతనో ఏమో అతని కళ్లకు అందఱూ ఒకలాగే కనిపించారు. ఫలానివాడని చూపలేకపోయాడు హంపన్న.

ఇదంతా అయేటప్పటికి హంపన్ననీరసస్థితి మఱింత విషమించింది. ఇక లాభం లేదని పోలీసు అధికారులు అతన్ని ఆస్పత్రికి తీసుకుపోయారు.

ఆరాత్రే రైలెక్కి మిలిటరీసోల్జర్లందఱూ సికింద్రాబాదు వెళ్లిపోయారు.

ఆమఱునాడే తన జీవితం పరోపకారంతో ఫలవంతం చేసుకున్న హంపన్న అంతిమనిశ్వాసం విడిచాడు.

డాక్టరు అతని తొడలోనుండి పిస్తోలుగుండు బైటికి తీశాడు. ప్రజలు యావన్మందీ హంపన్నకొఱకు దుఃఖించి సగౌరవంగా అతని మృతశరీరానికి ఖననసంస్కారం చేశారు.

అన్యాయంగా హంపన్నను చంపిన ఆసోల్జరు సికింద్రాబాదులో స్నేహితులతో హుషార్ అనుభవిస్తున్నాడు.

## 3

తప్పో ఒప్పో ఏపని చేసినా ఫలితంమాత్రం తప్పదు. నిప్పులో చెయ్యి పెడతాం, చెయ్యి కాలి తీరుతుంది. “అయితే రోజుకు లక్ష అబద్ధా లాడతాం, ఏమీ జరగదేం?” అని అనుకోగూడదు. దానికీ ఫలితం ఉంటుంది. కాని అది వెంటనే కనబడకపోవచ్చు.

హంపన్న తన్ను ఆశ్రయించిన అనాథస్త్రీల మానసంరక్షణకోసం తన ప్రాణా లొడ్డి సాహసించాడు. తత్ఫలితంగా గుండుదెబ్బ తిని యమయాతన పడ్డాడు. తుచ్ఛమైన తన కామాగ్నికి ఇంధనం కావలసిన స్త్రీలను రక్షించడానికి పూనుకున్న హంపన్నను ఆ తెల్లసోల్జరు పిస్తోలుతో కొట్టాడు. తత్ఫలితంగా అతని కసి తీరింది. అతని ఆచోకీ ఎవరికీ తెలియలేదు. పనుల్నీ, ఫలితాల్నీ లోకం ఇంతమాత్రంగానే సమన్వయించుకుంటుంది. ఈ స్థూలసమన్వయంలోనే అధర్మారంభం ఉన్నది.

రైలుగేటుహంపన్న మృతివార్త పత్రికల్లో గూడా పడింది. ఇంత మహాప్రపంచంలో ఎంతమందో అనేకకారణాలవల్ల చస్తూఉంటారు. ప్రతివానిచావూ అందర్నీ ఆకర్షించదు. కాని హంపన్నమరణం ఆబాలగోపాలం లోకాన్నంతటినీ ఆకర్షించింది. ఆ ఆకర్షణ హంపన్న చేసిన త్యాగాన్ని హర్షించి కాకపోవచ్చు. నిరాయుధుడైన ఒక సామాన్యపౌరుణ్ణి సాయుధుడైన యుద్ధభటుడు కాల్చిపారెయ్యడం సహించలేక కావచ్చు. ఏమైతేనేం, హంపన్నచావు ప్రభుత్వాధికారుల దగ్గఱనుండి గేటుకీపర్లవఱకూ ప్రతివార్నీ కదిలించివేసింది.

అప్పట్లో మదరాసుప్రభుత్వానికి ముఖ్యకార్యదర్శిగా (Chief Secretary) సర్ హెన్రీ స్టోక్సు దొరగారు పనిచేస్తున్నారు. ఆయన ఈవార్త చదివి ద్రవించిపోయాడు. ఇటువంటి అన్యాయాలు ఏమాత్రమూ ఉపేక్షింపబడగూడ దనుకున్నాడు. సక్రమమైన విచారణ జరపాలని వెంటనే పోలీసధికారుల నాజ్ఞాపించాడు.

రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా? ఇది వఱకు ఏదో లాంఛనప్రాయంగా నడిపించి తోసిపారేసిన హంపన్నకేసును అధికారుల ఆజ్ఞతో పోలీసువారు తిరిగి తీసుకుని విచారణ సాగించవలసివచ్చింది. దెబ్బతిన్న హంపన్న చచ్చిపోయాడు. ఏ సోల్జరు కాల్చాడో గుర్తుపట్టలేకపోయాడు. వేఱే సాక్ష్యమేమైనా ఉందా అంటే లేదు. తాడూ లేదు, బొంగరమూ లేదు. ఇంకేమిటి తిప్పడం?

అయితే ఏం? అధికారుల ఆజ్ఞ! పోలీసువారు ఊరుకోవడానికి వీల్లేదు. గుత్తి పోలీసు డిప్యూటీ ఇన్స్పెక్టరుజనరలు సపరివారంగా గుంటకల్లు పరుగెత్తుకువెళ్లాడు. ఆ సోల్జరు తన రివాల్వరు ఆ గేటు సమీపంలో ఎక్కడైనా పారేశాడేమో నని చుట్టుపక్కల పొదలూ, దుబ్బులూ సమూలంగా నాశనంచేసి వెదికారు. జొన్నచేలల్లో కాలిదార్ల వెంబడి పోయి అటూ ఇటూ బహుశ్రద్ధగా పరిశోధించారు. సమీపంలో ఉన్న గుంటల్లో నీళ్లు తోడించి బురద కలికించి గాలించారు. ఎక్కడా దాని పొడ కనిపించలేదు. కనిపించకలేదని ఊరుకోడానికీ వీల్లేదు. ఏమిటి చెయ్యడం?

ఆపరిస్థితుల్లో గుత్తిఇన్స్పెక్టరుకు ఒకేఒక ఆధారం కనిపించింది. అది హంపన్నతొడలోనుంచి బైటికి తీసిన గుండు. దాన్ని తీసుకుని ఆయన పోలీసు సూపరింటెండెంటుతో కలిసి బెంగుళూరు వెళ్లాడు. మామూలుగా గుండునంబర్ని బట్టి దాని పిస్తోలు ఏషాపులో ఎవరు కొన్నదీ పట్టుకోవచ్చు. కాని ఆ మహాపట్టణంలో ఏషాపని వెతకడం? అయినా ఆజ్ఞాతీవ్రతనుబట్టి వెతికి వెతికి వేసారిపోయారు. చిట్టచివఱకు స్టోక్సుదొరవారి మనోనైర్మల్యం స్పష్టం చెయ్యడానికో అన్నట్లు ఇన్స్పెక్టరుఅన్వేషణ ఫలించింది. ఆనంబరుపిస్తోలును వెల్లింగ్టనులో ఒక షాపువారు అమ్మినట్లు ఆచోకీ దొరికింది. అక్కడి పాతక్రయపత్రాలు తిరగదోడారు. ఆపిస్తోలును కొన్నది ఒక సోల్జరు. పేరు మిస్టర్ ఆష్. ఇంకేముంది? హంతకుడు పట్టుబడిపోయినట్లే అనుకున్నాడు పోలీసు ఇన్స్పెక్టరు.

ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా సరాసరి సికింద్రాబాదు వెళ్లిపోయారు పోలీసువారు. మిలిటరీ కేంద్రంలోనుంచి మిస్టర్ ఆష్‌ను పిలిపించారు. వెంటనే అరెస్టుచేసి అడిగారు. గుంటకల్ దగ్గఱ రైలుగేటు కాపలావాణ్ణి కాల్చింది నిజమేనని ఒప్పుకున్నాడు మిస్టర్ ఆష్. కాని తన ప్రాణం రక్షించుకోవడం కోసం కాల్చానన్నాడు.

అయితే ఏం!? ఆమాత్రం చాలు.

పోలీసువారు మిస్టర్ ఆష్‌ను రెండవతరగతి పెట్టెలో ఎక్కించి తీసుకుపోయి మదరాసుజిల్లా మేజిస్ట్రీటుసముఖంలో నిలబెట్టారు.

## ౪

కాల్చిన సోల్జరు చిక్కడం, ఈకేసు హైకోర్టులో విచారింపబడుతూఉండడం చనిపోయిన హంపన్నకు లౌకికంగా ప్రజల దృష్టిలో అత్యధిక ప్రముఖస్థానాన్ని కల్పించాయి. అటు మదరాసులోనేమి, ఇటు గుత్తిగుంటకల్లుల్లోనేమి ప్రతివారూ హంపన్నకేసు ఫలితాలకోసం అతిఅతురతతో ఎదురు చూస్తున్నారు.

అక్కడ హైకోర్టులో ప్రాసిక్యూషనువారు తమకు కావలసిన సాక్ష్యాన్నంతటినీ సేకరించి దాఖలు చేశారు. ఏ స్త్రీల మానాన్ని రక్షించడంకోసం హంపన్న ప్రాణత్యాగం చేశాడో ఆస్త్రీల నిద్దఱినీ గూడా హాజరుపెట్టారు. వారిదగ్గఱ వాఙ్మూలాలు పుచ్చుకున్నారు. అవి దాఖలుచేశారు. హంపన్న సాధారణంగా ఎవరిజోలికీ పోడనీ, కాని అధర్మం ఏమాత్రం సహించనివాడనీ, చాలా అణకువగలవాడనీ అతని సత్ప్రవర్తనను తెలియజేసే ఉల్లాఖులు అతన్ని ఎరుగున్న పెద్దపెద్ద ఉద్యోగులదగ్గఱ సంపాదించి వాటిని కూడా దాఖలుచేశారు. మిస్టర్ ఆష్ కాల్చానని ఒప్పుకుంటూనే ఉన్నాడు. కేసుఫలితం కళ్లకెదురుగుండా కనపడుతోంది. ఇంకే మక్కఱలేదని నిశ్చింతగా ఉన్నారు.

ప్రాసిక్యూషనువారు ఇంత చేస్తుంటే డిఫెన్సువారుమాత్రం ఊరుకున్నారా? వారూ ఊరుకోలేదు. హంపన్న మిస్టర్ ఆష్‌ను కొట్టవచ్చాడని ఋజువు చేసేందుకు కావలసిన ప్రయత్నాలన్నీ వారూ చేశారు. సాక్ష్యానికి ఆ నాడు మిస్టర్ ఆష్‌తో ఉన్న సోల్జర్లను గూడా రప్పించారు.

ఇక విచారణ ప్రారంభం అవుతుంది; ఫలితం బయటపడుతుంది.

అంతలో గుత్తిలో పెద్దలకు ఒక ఆలోచన తట్టింది. ఇరువురు దిక్కులేని స్త్రీల మానాన్ని రక్షించ

డానికి ప్రాణత్యాగం చేసిన హంపన్న స్మృతిచిహ్నం ఒకటి ఎందుకు స్థాపించకూడదూ అని. తట్టిందే తడవుగా ఆ ఆలోచనను ఆ పెద్దలు నలుగురికీ తెలియజేశారు. ప్రజలందఱూ దాన్ని విని హర్షించారు. యూరోపియనులూ, భారతీయులూ వారూ వీరూ అని విచక్షణలేకుండా ప్రతివారూ హంపన్న ధర్మవీరాన్ని ప్రశంసించి అతని స్మృతిచిహ్నస్థాపనకు వారికి వారికి తోచినట్లు సహాయం చేశారు. తలపెట్టిన వేళావిశేషం వల్ల అతడు దెబ్బతిన్న చోటుకు సమీపంలోనే స్థలం దొరికింది. కొనడం, రిజిస్టరుచెయ్యడం అన్నీ అయిపోయాయి. ఇక సమాధికట్టడమే తరవాయి.

అక్కడ హైకోర్టులో విచారణ ప్రారంభమయింది.

డిఫెన్సువారు అప్పటికప్పుడు అల్లి ప్రచురించిన కథతో ప్రాసిక్యూషనువారి బందోబస్తు పటాపంచలయిపోయింది.

హంపన్న కిందపడ్డప్పుడు అతని పక్కన వెదురుబొంగు పడిఉన్నది. దానికి రైలుగార్డు సాక్ష్యం. ఆ వెదురుబొంగుతో హంపన్న ఇద్దఱుముగ్గుఱు సోల్జర్లను కొట్టాడుకూడాను. దీనికి ఈ సోల్జర్లు ఇద్దఱి వీపులమీదా ఉన్న దెబ్బలు సాక్ష్యం. హంపన్న అంతలావు వెదురుబొంగు తీసుకుని కొట్టరావడంవల్ల మిస్టర్ ఆష్ తన్నూ, తన మిత్రులనూ రక్షించుకోవడానికి ఇంకేదిక్కూ తోచక పిస్తోలు ఉపయోగించవలసివచ్చింది. అసలు హంపన్నకూ, సోల్జర్లకూ సంబంధం ఏమిటి ? ఈ సోల్జర్లు గేటుదగ్గఱకు ఎందుకు వెళ్లారు ? హంపన్న వీళ్ల నెందుకు కొట్టడానికి వచ్చాడు ? వీటన్నిటికీ సమాధానంగా వెనక చాలా కథ ఉన్నది. ఈ సోల్జర్లు గుంటకల్లు స్టేషనుకు దగ్గఱున్న మిలిటరీక్యాంపుకు వచ్చిన రోజునుంచీ హంపన్న అక్కడకు వచ్చివెళ్లుతుండేవాడు. ఈ సంఘటన జరిగిన రోజు క్రితంరోజుకూడా వచ్చివెళ్లాడు. అతడు చెప్పినదాన్ని నమ్మి ఈ సోల్జర్లు ఆ గేటుదగ్గఱకు ఆ రోజున వెళ్లవలసివచ్చింది. తీరా వెళ్లితే అతను మాటతప్పినమనిషి అయాడు. పావలాచొప్పున ఇద్దురుగాని రండి అని పిలిచినవాడు రూపాయిచొప్పున ఇస్తేగాని వల్లగాదన్నాడు. ఇంతలో మాటతప్పే ఇతనితో లెక్కేమిటని సోల్జర్లు తమంతట తామే షెడ్డు తలుపులు తెరవబోయారు. దాంతో కోపం వచ్చి హంపన్న కఱ్ఱ తీసుకుని వీళ్లమీద పడ్డాడు. ఒకరిద్దఱిని కొట్టనూ కొట్టాడు. హంపన్న అప్పుడు బాగా తాగి ఉన్నాడు. అతని రౌద్రం చూస్తే ఎంతమందినైనా చంపేసేటట్టున్నాడు. అందుచేత తప్పనిసరి అయి మిస్టర్ ఆష్ కాల్చవలసివచ్చింది. ఇందులో మిస్టర్ ఆష్ తప్పేమీ లేదు.

ప్రాసిక్యూషనువారు వాదించారు. ఆ స్త్రీలలో ఒక ఆవిడ అరవైఏళ్ల ముదుసలి ముత్తైదువ. ఆమె గుగ్గిళ్లు అమ్ముకుని గౌరవంగా బతికే మర్యాదస్థురాలు. రెండవ ఆమె ఇరవైఅయిదేళ్ల జంగాలపడుచు. వివాహిత. ఇద్దఱు పిల్లల తల్లి. భర్త వ్యవసాయదారుడు. ఇంట్లో ముదుసలి అత్తకు పిల్లల నప్పగించి వేఱే తోడు లేనికారణాన జొన్నచేనులో పిట్టలు తోలుకోడానికి పొలానికి వస్తూ ఉంటుంది. హంపన్నను వీళ్లిద్దఱూ ఎరుగుదురు. రోజూమాదిరే ఆ రోజునకూడా రోడ్డువెంబడి ఊళ్లోకి వెళ్లుతుంటే ఈ సోల్జర్లు వెంబడిపడ్డారు. వీళ్లిద్దఱూ భయపడి పాఱిపోయి హంపన్న శరణు చొచ్చారు. హంపన్న వీళ్లను తన షెడ్డులో దాచాడు. హంపన్న ఇటువంటి దుష్ప్రవర్తన కలవాడని ఎక్కడా సాక్ష్యంలేదు. అతడు తాగుతాడన్న మాటకూడా శుద్ధ అబద్ధం. కూటికిలేనికారణాన గుణానికి తక్కువని గౌరవంకల స్త్రీలను అవమానించడం అసమంజసం. అందులో ఒకతె అరవైఏళ్ల ముసలిది. వీళ్లు లోపల తలుపువేసుకునిఉండగా తలుపు పగలగొట్టడానికి ఈ సోల్జర్లు ప్రయత్నంచేశారు. బయట వేసిన తాళంగూడా పగలగొట్టారు. ఇదుగో తాళం ఇక్కడనే ఉన్నది. హంపన్న కఱ్ఱ పుచ్చుకుని బెదిరించినమాట వాస్తవం. అతడు కొట్టాడన్నమాటే నిజమైతే రెండునెలలక్రితం కొట్టిన దెబ్బలు ఇప్పటివఱకూ ఉండడం అసంభవం. ఇవి ఇటీవల మఱెక్కడో తిన్న బాపతై ఉండాలి. ఇటు హంపన్న ప్రవర్తనను చూచినా, అటు ఆ స్త్రీల గౌరవాన్ని గమనించినా డిఫెన్సువారి వాదం అంతా అభూతకల్పనగా కనిపించక

తప్పదు. అందుచేత మిస్టర్ ఆప్ తన తుచ్ఛమైన కామ తృప్తికి అడ్డువచ్చిన హంపన్నను అన్యాయంగా కాల్చాడు అని మా దృఢమైన విశ్వాసం.

ప్రధానన్యాయమూర్తులు కాలిన్సుదొరవారు ఉభయవాదాలూ విన్నారు. శిక్షానిర్ణాయకసంఘానికి డిఫెన్సువాదంవైపు మొగ్గుచూపుతూ కేసువివరాలన్నీ క్రోడీకరించిచెప్పారు.

నిర్ణాయకసంఘంవారు న్యాయస్థాన ముఖాన మిస్టర్ ఆప్‌ను పూర్తిగా నిర్దోషునిగా ప్రకటించారు.

ఈతీర్పు విని మదరాసుప్రజలు 'అన్యాయం అన్యాయం.' అని వేనోళ్ల గొణిగారు. మరికొందరు ధైర్యవంతులు "ఇది కేవలం జాతిపక్షపాతం"అని పత్రికల్లో విమర్శించారు.

ఈతీర్పు గుత్తిప్రజలకు చేరకముందే అక్కడ హంపన్నస్మృతిచిహ్ననిర్మాణం పూర్తిఅయిపోయింది. "ఈసమాధిలో ఇరువురు దిక్కులేని స్త్రీల మానాన్ని రక్షించే ప్రయత్నంలో ౧౮౬౩-వ సంవత్సరము అక్టోబరునెల నాల్గవతేదీన ఒక యూరోపియనుసోల్జరుచే పిస్తోలుతో కాల్చబడ్డ గొల్లహంపన్న శిష్టాస్థికలు ఉన్నాయి. యూరోపియనులచేతా, భారతీయులచేతా ప్రశంసింపబడిన ఆ పుణ్యాత్ముడు ఆనాడే శివంగతుడైనాడు" ఈ అర్థాన్ని తెలియజేసే ఆంగ్ల వాక్యాలు చెక్కిన శిలాఫలకం దానిమీద స్థాపించారు.

మూడేళ్లు గిఱ్ఱున తిరిగాయి.

సమాధి మొదట స్థాపించిన చోటనే ఉన్నా హంపన్నమాత్రం ఎవరికీ జ్ఞాపకంలేదు. కాని ప్రజలందఱూ ఆసమాధిదగ్గఱ ఎవడో భయంకరాకారుడు కనిపిస్తూఉంటా డంటారు.

ఆరోజు ఆకాశమంతా భయంకరంగా మబ్బులు కమ్మిఉంది. సూర్యాస్తమయం కాకుండానే అయిందన్న భ్రమతో పక్షులుగూడా గూళ్లు చేరుకోడానికి తొందఱపడి వెళ్లిపోయాయి. ఆ నిర్మానుష్యమైన ప్రదేశంలో హంపన్నసమాధి ఒక్కటే స్వచ్ఛాతిస్వచ్ఛమై అప్పుడప్పుడు వెలువడుతున్న సౌదామినీ నీ రాజనాలతో ప్రకాశిస్తున్నది. భయపడేవారికి ఆశ్రయంలేదని బెదరించే ఆ ఆకాశంకింద అది ఒక్కటే ఆశ్రయమన్నట్లు దూరానికి కనిపిస్తున్నది.

కుండపోతగా వర్షం కురవడం మొదలుపెట్టింది. అయిదునిమిషాలలో అయిదు దుక్కుల వాన కురిసినట్లు కురిసింది. ఆ వానకు ఆ కొండనేలమీద మహాప్రవాహాలు వెల్లివిరిశాయి. గైరికధాతువులు కలవడంవల్లనో ఏమో ఆనీరు కదనభూమిని కడిగివస్తున్నట్లు తోచింది.

అతడెవరో సాయంవేళ వాహ్యాళికి బయలుదేరాడుకాబోలు, ఈవానలో చిక్కుబడిపోయాడు. తడిసి ముద్దఅయిన గుడ్డలతో, చంకకింది కఱ్ఱలతో నడవలేక నడవలేక నడుస్తున్నాడు. అతని అదృష్టవశాన ఈవానకు తోడు గాలే లేదుకాని లేకుంటే అంతకుముందెప్పుడో నేలమీదికి ఈడ్చికొట్టబడేవాడు. ఈ వానకైనా అతడు మంచి బలిష్ఠుడు కాబట్టి తట్టుకుని ఆ ఒంటికాలితోనే నడుస్తున్నాడు. గుండెల్లో ఏం బాధో పాపం, అప్పుడప్పుడు చంకకింది కఱ్ఱలతో చటుక్కున ఆగి చేతులతో గుండె నొక్కిపట్టుకుని దగ్గుతున్నాడు. పావుగంటనుండీ వానలో తడుస్తూ ఉండడంవల్ల కాబోలు దగ్గు మఱీ ఎక్కువయింది.

హంపన్నసమాధి రోడ్డుకు పక్కగా నాలుగు గజాల్లో ఉన్నది. అంతదాకా వచ్చి ఆ వ్యక్తి ఇక అడుగు వెయ్యలేకపోయాడు. ఇంకా వాన కురుస్తూనే ఉన్నది. తల ఆడించి క్రాపింగుజుట్టులో నీళ్లు దులుపుకుంటూ అటూ ఇటూ చూచాడు- ఏమైనా ఆశ్రయముందేమోనని- దీనమైన దృక్కులతో. తల దాచుకోడానికి కాకపోయినా చతికిలబడడానికైనా యోగ్యమైన స్థలం అది ఒక్కటే కనిపించింది అక్కడ. నెమ్మదిగా కాళ్లీడ్చుకుంటూ పోయి దాని చుట్టు అరుగుమీద కూలబడ్డాడు.

ఆ సమాధిస్పర్శ అతని శరీరంలో అణువణువునూ కదలించివేసింది. వెఱ్ఱెత్తినట్లయి అటూ ఇటూ

చూచాడు. అంతలో గుండెనొప్పి వచ్చి ఎడంచేత్తో గుండె నదుముకుంటూ సమాధివంక చూస్తున్నాడు. కనులు మిఱుమిట్లుగొలిపే ఒక పెద్ద మెఱుపు మెఱిసింది. ఆ వెలుగులో దానిమీది 'గొల్లహంపన్న' అన్న పేరు కన్పించింది. అతని కుడిచెయ్యి అప్రయత్నంగా లేచి అతని నదురు పట్టుకుంది. ఎంతబాధ పడ్డాడో ఏమో అయిదునిమిషాలు అట్లాగే రాతిబొమ్మ అయిపోయాడు.

అంతలో మఱొక మెఱుపు మెఱిసింది. ఆమెఱుపుతో అతనిలోకి కొంత చైతన్యం వచ్చింది.

ఆ చీకట్లో కుడిచేత్తో దేనికో తడిమిచూచాడు. ఏదో రాయిలా తగిలింది. కాని అది బొగ్గుముక్క. దాన్నే మహానందంతో తీసుకున్నాడావ్యక్తి. దాన్ని అట్లాగే చేత్తో పుచ్చుకుని ఎందుకో తీఱని వ్యథతో ఎదురుచూచాడు.

మళ్లీ మెఱుపు మెఱిసింది. ఆ మెఱుపువెలుగులో అమాంతం కుడిచెయ్యి ఎత్తి, స్పష్టంగా కనిపించిన 'యూరోపియన్ సోల్జరు' అని వ్రాసి ఉన్నచోట పెట్టాడు. వెలుగుపోయింది. ఆ చీకట్లోనే దాన్ని కొట్టేసి, దానిమీదే ఏదో వ్రాయబోయాడు. A, S అని రెండక్షరాలు వ్రాశాడు. H అని కాబోలు మూడో అక్షరం సగం వ్రాసేటప్పటికే వెన్ను వాలిపోయి చెయ్యిజారిపోయింది.

మఱునాడు గుంటకల్లు మిలిటరీక్యాంపువారు అతని శవాన్ని తీసుకుపోయి మఱొకచోట పాతిపెట్టారు. ఆ నాటినుంచీ హంపన్నసమాధిదగ్గఱ ఎవరికీ ఏ భయంకరాకారుడూ కనబడడం లేదంటారు ప్రజలు.

[ఈ కథ ఇంచుమించు అంతా జరిగిందే. ఒక్క అయిదవభాగంలోది మాత్రమే నేను కల్పించింది. తక్కినదాన్ని హిందూరజతోత్సవసంచికలోని కేశవపిళ్లగారి Last fifty years అన్న వ్యాసంనుండి సేకరించాను. హంపన్నసమాధి ఇప్పటికీ గుత్తిలో రోడ్డుకు పక్కగా మన్రోసత్రం సమీపంలో ఉన్నది.]

